కేయూ భూముల పరిరక్షణకు ముందడుగు

- రూ.10 కోట్లతో ప్రహరీ నిర్మాణం
- పనులు ప్రారంభించిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూన్ 29 : కేయూ భూముల పరిరక్షణకు ఎట్టకేలకు ముందడుగు పడింది. ప్రహరీ పనులను రిజిస్ట్రార్ మల్లారెడ్డి ప్రారంభించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, క్యాంపస్ చుట్టూ 7 కిలోమీటర్లకు పైగా రూ.10కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు తెలిపారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేలా తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మొదట ప్రధాన రహదారి వైపు పనులు ప్రారంభమయ్యాయని, నూతన 200 పడకల మహిళా వసతి గృహానికి కావాల్సిన మంచాలను సమకూరుస్తున్నట్లు తెలిపారు. కామన్ మెస్‌లో ఒకేసారి 300 మంది విద్యార్థులు భోజనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డి పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

విధాన నిర్ణయాల్లో స్టాటిస్టిక్స్‌దే ప్రధాన భూమిక

మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

ఏ దేశంలోనైనా విధాన నిర్ణయాల్లో స్టాటిస్టిక్స్‌దే ప్రధాన భూమిక అని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ స్టాటిస్టిక్స్ విభాగాధిపతి శ్రీనివాస్ అధ్యక్షతన విభాగ సెమినార్ హాల్‌లో భారతదేశ ఆధునిక గణాంకాల పితామహుడు ఆచార్య ప్రసన్నచంద్ర మహలనోబిస్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ స్టాటిస్టిక్స్ డే కార్యక్రమంలో మాట్లాడారు. నిర్ణయాలు, ప్రణాళికలు, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విషయంలో గణాంకాలు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు సంప్రదాయ, నవీన మార్పులకు అనుగుణంగా స్టాటిస్టిక్స్ నేర్చుకోవాలన్నారు. క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, సహాయ రిజిస్ట్రార్ కోలా శంకర్, పార్ట్‌టైం అధ్యాపకులు కల్యాణి, గాయత్రి, హరికృష్ణ, సిబ్బంది సతీశ్, ఐలయ్య పాల్గొన్నారు.

5 నుంచి పీజీ పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 29 : కేయూ పీజీ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షల రివైజ్‌డ్ టైం టేబుల్‌ను పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్‌ఎల్ సౌజన్య విడుదల చేశారు. జూలై 5న మొదటి పేపర్, 8న రెండో పేపర్, 10న మూడో పేపర్, 12న నాలుగో పేపర్, 15న ఐదో పేపర్, 18న ఆరో పేపర్ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అగు కుమ్మరికుంట్ల లక్ష్మి, భర్త: మార్కండేయ, నివాసం: ఇ.నెం.11-19-140, కాశిబుగ్గ, వరంగల్ గారు తెలియపరచునది ఏమనగా, నేను అనగా కుమ్మరికుంట్ల లక్ష్మి కొనుగోలు చేసిన దస్తావేజు నెం. 1296/2011 మరియు నాయొక్క భర్తద్వారా దానదస్తావేజు రిజిస్ట్రేషన్ చేసుకున్న నా కుమారులు 1) కుమ్మరికుంట్ల గోపి యొక్క దానదస్తావేజు నెంబర్ 591/2009 మరియు 2) కుమ్మరికుంట్ల వేణు యొక్క దాన దస్తావేజు నెం. 590/ 2009 గల దస్తావేజులు సబ్-రిజిస్ట్రార్ వరంగల్ ఫోర్ట్ నందు రిజిస్ట్రేషన్ చేసుకున్న దస్తావేజులు మా ఇంటిలో తనాబిలో పెట్టిన పై దస్తావేజులన్నీ చెదలు పట్టినాయి. అని తెలియపరచు చున్నాను. మరియు మేము ఇట్టి దస్తావేజుల ద్వారా ఎవరికి అమ్మలేదనియు, కుదువబెట్టలేదనియు మరియు ఎక్కడ పోగొట్టుకోలేదని తెలిపరచు చున్నాను. కావున ఇట్టి దస్తావేజులన్నియు చెదలు పట్టి ఖరాబు అయినదని తెలుపుటకు ఈ ప్రకటన ఇవ్వనైనది.
తేది.: 30-06-2024
(నా క్లయింట్ కోరిక్‌పై జారీ చేయనైనది.)
సం/- **సంబారి ప్రభాకర్** న్యాయవాది
ఇ.నెం. 11-19-15/ఎ, బాపూజీ వీధి,
కాశిబుగ్గ, వరంగల్. సెల్ : 9963289033

స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణకు 9లోగా నమోదు చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 29: కాకతీయ విశ్వవిద్యాలయంలో సెల్ట్ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు నిర్వహించే 'స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్'లో కొన్ని సీట్లు మాత్రమే ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు, తమ పేర్లను 9వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సెల్ట్ సంచాలకులు మేఘనారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు రూ.1000, ఇతరులు రూ.1500, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, నాన్ యూనివర్సిటీ ఫండ్‌లో చెల్లించి, సెల్ట్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

RENT/ LEASE

★కమర్షియల్ బిల్డింగ్ Rent/ Lease కు ఇవ్వబడును. హనుమకొండలోని అలంకార్ జంక్షన్ శరత్ హాస్పిటల్ లేన్‌లో HP Gas ప్రక్కన G+4, Each Flore 1550 Sq.Ft with కమర్షియల్ లిఫ్ట్. సంప్ర: 9440505062.
NTW-00

WANTED TEACHERS

★Wanted Teachers to teach 3rd to 6th Classes Social and 4th to 8th Classes Computers. VIGNAN HIGH SCHOOL, Dharmaram, Cell: 9441997597, 8341599333.
NTW-6504

HEALTH CARE

★ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం||ల సేవలు అందించబడును. సంప్ర|| 6281476205, 9440325526
KMM_11679

WANTED

★Wanted Pharmacy Manager, Pharmacists, HR Manager (with Hosp Exp), PRE, Front Office Executives, Financial counsellor, Floor Manager, Nursing staff, (GNM B.sc Nur) for a reputed Hospital. Cont.: 7337313271, 9949499959.
NTW-14482

★Corel Draw, Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639

CHANGE OF NAME

★I, SHARMIN SHAMSHUDDIN DHANANI, R/o. 8-9-183, Polavari street, Sadashiva Nilayam, Warangal, Telangana. Changed My Name as SHARMIN DHANANI.
NT-327672

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

- నీట్, రామమందిరం, అటల్ సేతు, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో లోపాలు
- మేడిగడ్డపై గగ్గోలు పెట్టే బీజేపీ, కాంగ్రెస్‌కు ఇవి కనపడవా?
- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అవగాహనతో పోటీ చేశాయి
- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లోనే అభాసుపాలు
- హనుమకొండ జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ సుధీర్‌కుమార్

ఎల్కతుర్తి, జూన్ 29 : మేడిగడ్డపై అడ్డగోలుగా గగ్గోలు పెట్టే కాంగ్రెస్, బీజేపీ నాయకులు కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వం నిర్మించిన ఢిల్లీ ఎయిర్‌పోర్టులోని టెర్మినల్, అటల్‌సేతు, రామమందిరంలోకి నీళ్లు, నీట్ ఎగ్జామ్‌లో అవకతవకలపై ఎందుకు మాట్లాడడం లేదని హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ ప్రశ్నించారు. శనివారం ఎల్కతుర్తిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం చేపట్టిన ఈ ప్రాజెక్టులను స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని గుర్తుచేశారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ వీటన్నింటిపై స్పందించాలని, వీటి లోపాలతో తలకాయ ఎక్కడ పెట్టుకోవాలో తెలియక మాట్లాడడం లేదని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్ అయి ప్రాంతీయ పార్టీలను దెబ్బతీయాలని చూస్తున్నాయని, అందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి కొన్ని నియోజకవర్గాల్లో డమ్మీ అభ్యర్థులను పెట్టి బీజేపీ గెలుపునకు సహకరించారని ఆరోపించారు. దేశంలో 27శాతం ఉన్న యువతను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. మత తత్వ సిద్ధాంతాలతో దేశాన్ని నాశనం చేయాలని చూస్తోందన్నారు. తెలంగాణను కాంగ్రెస్, దేశాన్ని బీజేపీ నాశనం చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ అన్ని రంగాల్లో అభాసుపాలైందని, గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదని, కార్మికులకు జీతాల్లేవని, రైతుబంధు, రైతు బీమా, పింఛన్ల పెంపు వంటి గ్యారెంటీలను అమలు చేయక ప్రజావ్యతిరేకతను కూడగట్టుకుందని అన్నారు. వాణిజ్యపరంగా, పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లో ఉన్న మామునూర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ మేకల స్వప్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, తంగెడ నగేశ్, మునిగడప శేషగిరి, తంగెడ మహేందర్, కడారి రాజు, గొల్లె మహేందర్, దేవేందర్‌రావు, చెవుల కొమురయ్య, దుగ్యాని సమ్మయ్య, గొడిశాల వినయ్, కొరె రాజుకుమార్, సాతూరి శంకర్, వాజ్‌పేయి పాల్గొన్నారు.

కాజీపేటలో రైల్వే ట్రాక్‌మెన్‌ల సమస్యలను ఏడీ ఈఎన్ రామకృష్ణరాజుకు వివరిస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రెటరీ రవీందర్

ట్రాక్ మెన్‌ల సమస్యలను పరిష్కరించాలి

సికింద్రాబాద్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రెటరీ రవీందర్

కాజీపేట, జూన్ 29 : రైల్వే ఇంజినీరింగ్ విభాగంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ట్రాక్‌మెన్‌ల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సికింద్రాబాద్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రెటరీ పిల్లలమర్రి రవీందర్ డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని ఏడీఈఎన్ కార్యాలయంలో శుక్రవారం రైల్వే మజ్దూర్ యూనియన్ ఇంజినీరింగ్ బ్రాంచ్ సెక్రటరీ రాజేందర్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన డివిజనల్ సెక్రెటరీ రవీందర్ యూనియన్ నేతలతో ఏడీఈఎన్ రామకృష్ణ రాజును కలిసి ట్రాక్‌మెన్‌ల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాజీపేట సెంట్రల్ సెక్షన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు అధిక బరువు కలిగి పనిముట్లతో ఇబ్బందులకు పాలవుతున్నారని, లైట్ వెయిట్ టూల్స్ అందించామన్నారు. కాజీపేట సెంట్రల్ సెక్షన్ పరిధిలోని 1, 2 యూనిట్‌ల రెస్ట్‌రూంలు పూర్తయ్యాయని వెంటనే అందించామని, బ్రిడ్జిల వద్ద మినీ హట్‌లను నిర్మాణం చేయాలని, కీ మెన్, పెట్రోలింగ్ బీట్ లెంత్ తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఆల్ బ్రాంచ్ కో ఆర్డినేటర్ నాయిని సదానందం, సెక్రటరీలు సమ్మయ్య, రాజేందర్, యూనియన్ సీనియర్ నేతలు ఇక్బాల్, లక్ష్మీనారాయణ, పాశం రాజు, కర్ణాచారి, సీసీఎస్ గెలిగేట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ స్కూల్ జిల్లాస్థాయి ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 29 : హైదరాబాద్‌లోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాలకు హనుమకొండ జేఎన్‌ఎస్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ముగిసినట్లు హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి గుగులోత్ అశోక్ కుమార్ తెలిపారు. హనుమకొండ జిల్లాలోని వివిధ మండలాల బాలబాలికలు హాజరు కాగా, వారిలో బ్యాటరీ టెస్టుల ద్వారా ఎంపిక పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయి పోటీలలో ఎంపికైన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని, జూలై 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి ఎంపికలకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల్లోపు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో హాజరు కావాల్సి ఉంటుందని వివరించారు. జనన ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, స్టడీ ధ్రువీకరణ పత్రం, చదువుతున్న స్కూల్ నుంచి, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, ఆధార్‌కార్డు, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు (ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు) తీసుకెళ్లాలని సూచించారు.

రేపటి నుంచి రెండు రైళ్ల రద్దు

కాజీపేట, జూన్ 29 : కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా నడిచే పలు ప్రయాణికుల రైళ్లను జూలై 1 నుంచి 31 వరకు రద్దు చేశారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో జరుగుతున్న మూడోలైన్ ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేసింది. కాజీపేట మీదుగా ప్రతి రోజు సికింద్రాబాద్- వరంగల్, వరంగల్ - హైదరాబాద్ మధ్య నడిచే పుష్‌పుల్, కాజీపేట-బల్లార్షా, బల్లార్షా- కాజీపేట మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేసినట్లు చెప్పారు. అదే విధంగా కాజీపేట టౌన్ స్టేషన్ బైపాస్ లైన్‌లో జరుగుతున్న పనుల కారణంగా భద్రాచలం రోడ్డు - బల్లార్షా, సిర్‌పూర్ టౌన్ - భద్రాచలం రోడ్డు మధ్య నడిచే సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ రైలును జూలై 1 నుంచి 31 వరకు కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

గుట్కాల పట్టివేత

కాజీపేట, జూన్ 29 : కాజీపేట చౌరస్తాలో ప్రభుత్వ నిషేధిత గుట్కా, అంబర్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన శనివారం జరిగింది. కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో గుట్కా, అంబర్ ప్యాకెట్‌లను విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు చౌరస్తాలోని గన్ను వెంకటేశ్వర్లు (76)ను తనిఖీ చేయగా అతడి వద్ద దాదాపు రూ.22,941 విలువైన గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీన చేసుకున్నట్లు చెప్పారు. వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్‌షాక్‌తో మృత్యువాత పడిన పాడిగేదెలు

విద్యుదాఘాతంతో ఆరు గేదెలు మృతి

దామెర, జూన్ 29 : మండల కేంద్రం సమీపంలో ఆరు పాడిగేదెలు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. ఏఈ గుర్రం రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దామెర సమీపంలోని పోలుసాని ఇంద్రారెడ్డి, కుక్కల మల్లయ్య, మ్యాల గవాస్కర్, మరో ముగ్గురికి చెందిన గేదెలు మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లాయి. భారీ వర్షం, ఈదురుగాలులు రావడంతో చెట్లకొమ్మలు విద్యుత్ తీగలపై పడి తీగలు తెగిపడ్డాయి. అటువైపు వెళ్లిన గేదెలకు విద్యుత్ తీగలను తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి.

కాశీవిశ్వనాథరెడ్డి సేవలు చిరస్మరణీయం

ముల్కనూరు సహకార పరపతి సంఘం అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

విశ్వనాథరెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రవీణ్‌రెడ్డి, సభ్యులు

భీమదేవరపల్లి, జూన్ 29 : రైతుల శ్రేయస్సు కోసం కాశీ విశ్వనాథరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శనివారం పరపతి సంఘం ప్రధాన కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కాశీ విశ్వనాథరెడ్డి 38వ వర్ధంతి సభ జరిగింది. సంఘ సీనియర్ సభ్యులు ఏనుగు వీరమల్లారెడ్డి, ఏనుగు వీరారెడ్డి కాశీ విశ్వనాథరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కడారి ఆదాం, డైరెక్టర్లు కూన కనుకయ్య, మారుపాటి జైపాల్‌రెడ్డి, కంకల భాగ్య, గజ్జి వీరయ్య, అంబాల రాములు, ఈర్ల మూగయ్య, బేల కనుకమ్మ, కంది రవీందర్‌రెడ్డి, కర్రె మహేందర్, మండ శ్రీనివాస్, చవ్వాల బుచ్చయ్య, గుగులోత్ భాషు, బొల్లపల్లి వీరన్న, జీఎం మారుపాటి రాంరెడ్డి పాల్గొన్నారు.

భద్రకాళీ ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

వరంగల్, జూన్ 29 : భద్రకాళీ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ హనుమంతరావు అన్నారు. శనివారం ఆయన భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.30కోట్లతో నిర్మిస్తున్న మాడవీధుల పనుల పురోగతిని పరిశీలించారు. మాడవీధుల నిర్మాణంపై దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కావాల్సిన నిధుల వివరాలతో నివేదిక పంపించాలని, మంజూరు కృషి చేస్తానన్నారు. అన్నదాన సత్రం, వేద పాఠశాల భవనాల నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, మేడారం ఈవో రాజేంద్రం, పౌరసంబంధాల శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జగన్, ఇంజినీర్ రాములు, ఆలయ ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు శేషు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి రైల్వే ఉద్యోగి మృతి

కాజీపేట, జూన్ 29 : ప్రమాదవశాత్తు గుర్తుతెలియని రైలు నుంచి జారి పడి ఓ రైల్వే ఉద్యోగి మృతిచెందిన ఘటన కాజీపేట రైల్వే టౌన్ స్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగింది. కాజీపేట జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండకు చెందిన బస్కే పరమేశ్వర్(35) రామగుండంలో రైల్వే సీఅండ్‌డబ్ల్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. డ్యూటీ చేసేందుకు శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరాడు. గుర్తుతెలియని రైలులో వెళ్తూ కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి, శవాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్కతుర్తి, జూన్ 29 : మండలంలోని శాంతినగర్ శివారు వరంగల్ - కరీంనగర్ ప్రధాన రహదారిపై గుర్తుతెలియని కారు, బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జీల్గుల గ్రామానికి చెందిన కక్కెర్ల అఖిల్, ఇలాసాగరం అభి బైక్‌పై హుజూరాబాద్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే కారు ఎదురుగా వచ్చి ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు ఘటనా స్థలం నుంచి వెళ్లిపోవడంతో ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

కొచ్చిలో ముల్కనూరు డెయిరీ అధ్యక్షురాలు ధనశ్రీకి సన్మానం

బుర్ర ధనశ్రీని సన్మానిస్తున్న ఐడీఎఫ్ సంస్థ ప్రతినిధులు

భీమదేవరపల్లి, జూన్ 29 : కేరళ రాష్ట్రం కొచ్చిలో జరిగిన ఐడీఎఫ్(ఇంటర్నేషనల్ డెయిరీ ఫెడరేషన్) సమావేశాల్లో ముల్కనూరు మహిళా సహకార డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జీఎం మారుపాటి భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్‌డీడీబీ, ఐడీఎఫ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో స్పీకర్‌గా బుర్ర ధనశ్రీ వ్యవహరించగా, జీఎం పవర్ ప్రజెంటేషన్ ద్వారా ముల్కనూరు డెయిరీ గురించి వివరించారు. డెయిరీ పనితీరు, సాధించిన విజయాలకు బుర్ర ధనశ్రీని నిర్వాహకులు సన్మానించారు. ఐడీఎఫ్ అధ్యక్షులు బ్రెజెల్లా, భారత పశుసంవర్ధకశాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ, ఐడీఎఫ్ ప్రాంతీయ డైరెక్టర్ లారెన్స్ రెలెంట్స్, ఎన్‌డీడీబీ చైర్మన్ మనీషా పాల్గొన్నారు.

భద్రకాళీ ఆలయ హుండీ లెక్కింపు

వరంగల్, జూన్ 29 : భద్రకాళీ ఆలయ హుండీ లెక్కింపు శనివారం ఆలయ మహా మండపంలో చేపట్టారు. ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు శేషు ఆధ్వర్యంలో జరిగిన హుండీ లెక్కింపులో రూ. 56 లక్షల 75వేల 293 ఆదాయం వచ్చింది. 293 అమెరికా డాలర్లు, 20 కెనడా డాలర్లు, 50 యూఏఈ దిర్హమ్స్, 805 ఆస్ట్రేలియా డాలర్లు, 20 ఇంగ్లాండ్ పౌండ్స్ లభించినట్లు తెలిపారు. మిశ్రమ బంగారాన్ని తిరిగి హుండీలో వేసి సీల్ చేశారు. దేవాదాయ శాఖ అధికారి సంజీవరెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు.

ఉత్తమ టీచర్ ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, జూన్ 29 : జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు ఆసక్తి, అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ హై తెలిపారు. http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బ్యాంకు మహాజన సభలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని

వరంగల్ డీసీసీబీని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుపుతాం

- మహాజన సభలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

సుబేదారి, జూన్ 29 : వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకును రానున్న రోజుల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలోకి తీసుకురావడానికి సమష్టిగా పనిచేస్తామని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. శనివారం నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మహాజన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నాలుగేళ్లలో బ్యాంకు రూ.1,935కోట్ల టర్నోవర్ సాధించిందని, బ్యాంకు నుంచి 78వేల మంది రైతులకు పంట రుణాలు ఇచ్చామని పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సమష్టి కృషితో బ్యాంకు రూ.9.12కోట్ల లాభాలతో నడుస్తున్నదని, వచ్చే ఏడాదిలోపు రూ.15కోట్ల లాభాలు, రూ.2,200 కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. బ్యాంకు వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు చెట్టుపల్లి మురళీధర్‌రావు, కంది శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో వజీర్ సుల్తాన్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 29 : విద్యార్థులు పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా సైన్స్ అధికారి, నేషనల్ గ్రీన్ కార్ప్స్ కన్వీనర్ శ్రీనివాసస్వామి అన్నారు. ప్రభుత్వ అభ్యసనోన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు కవిత్వ, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. 23పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా, విజేతలకు జిల్లా సైన్స్ అధికారి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. రిసోర్స్ పర్సన్లు సారంగపాణి, శేషగిరి, సంపత్, సునీత, ఉపాధ్యాయులు వీరప్రతాప్, నరేందర్, వెంకటేశం, ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ బాధ్యులు వకులాభరణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహ జ్యోతి

రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి రొనాల్డ్ రాస్

సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి రొనాల్డ్ రాస్, చిత్రంలో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ సబర్బన్, జూన్ 29 : రాష్ట్రంలో ఉన్న అర్హులందరికీ గృహజ్యోతి వర్తిస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి రొనాల్డ్ రాస్ అన్నారు. శనివారం ఎన్పీడీసీఎల్ విద్యుత్ భవన్‌కు వచ్చారు. ఆయనకు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్వాగతం పలికారు. ఆ తర్వాత అక్కడే ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించి పనితీరు పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మీసేవ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఉన్న వినియోగదారులను గృహజ్యోతి పథకం గురించి అడిగారు. ఆయన వెంట సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్ కుమార్, సదర్‌లాల్, మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, ఎస్ఈ వెంకటరమణ, డీఈ సాంబరెడ్డి, దర్శన్, జానకీరాం రెడ్డి, ఏడీఈ మల్లికార్జున్ పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యం

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి రొనాల్డ్‌రాస్ అన్నారు. నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్లు, సీజీఎంలు జీఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని మెరుగైన ఫలితాలను సాధించాలని సూచించారు. వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారంలో చొరవ చూపాలని తెలిపారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ సంస్థ పరిధిలోని 16 సర్కిళ్లలో 67లక్షల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. కొత్త సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్ల నిర్మాణం, పాత సబ్‌స్టేషన్ల పునరుద్ధరణ పనులను భారీ ఎత్తున చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో సీజీఎంలు తిరుమల్‌రావు, మధుసూదన్, కిషన్, రాజుచౌహాన్, కేఎన్ గుట్ట, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

అరెస్టయిన బీఆర్‌ఎస్ నాయకులకు పరామర్శ

అరెస్టయిన వారిని పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

హనుమకొండ, జూన్ 29 : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్, హనుమకొండ పర్యటనను అడ్డుకుంటామని చెప్పిన విద్యార్థి ఉద్యమకారులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి ఆయా పోలీస్ స్టేషన్లకు వెళ్లి పరామర్శించారు. బీఆర్‌ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, ఇన్‌చార్జి జెట్టి రాజేందర్, రాష్ట్ర నాయకుడు సూర్యకిరణ్, కంజర్ల మనోజ్, సుమన్, సొరం రఘు ఉండగా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఇన్‌స్టాలో పరిచయం.. బాలిక అదృశ్యం

- పట్టుకున్న పోలీసులు
- నిందితుడిపై అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసు

కమలాపూర్, జూన్ 29 : ఇన్‌స్టాగ్రామ్‌లో అబ్బాయితో పరిచయం బాలిక అదృశ్యానికి కారణమైంది. సీఐ హరికృష్ణ కథనం ప్రకారం.. బాలికకు తల్లిదండ్రులు లేకపోవడంతో మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆమె తాత ఇంట్లో ఉంటున్నది. ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మహ్మద్‌నగర్‌కు చెందిన మిల్దొడ్డి అమృత్(23) పరిచయమయ్యాడు. ఈ క్రమంలో సదరు యువకుడు బాలికకు మాయ మాటలు చెప్పడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. వారం క్రితం బాలిక అదృశ్యం కావడంతో ఆమె మేనమామ పోలీసులకు ఈనెల 23న ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు మొబైల్ సిగ్నల్, సీసీ కెమెరాలను పరిశీలించి గుర్తించారు. మొబైల్ డేటా ద్వారా ఆమె ఉంటున్న అడ్రస్‌ను గుర్తించి అక్కడికి వెళ్లి బాలికను పట్టుకున్నారు. మల్దొడ్డి అమృత్‌పై అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.